సాక్షి
వికారాబాద్
సోమవారం : 25 సెప్టెంబర్ 2023



సత్తాచాటిన విద్యార్థులు

కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 4వ, 6వ సెమిస్టర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. 8లో ▸



పేదలకు అండగా ఉంటాం

పేదలకు అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ అన్నారు. 8లో ▸



మూడేళ్ల ముచ్చటే !

ప్రజలకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్లు మూడేళ్లకే మూలకు చేరాయి. 9లో ▸

సేవలన్నీ 'ప్రైవేటు'కే..!

కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో వైద్యులు తమ ప్రాణాలను అడ్డుపెట్టి మహమ్మారిని కట్టడి చేశారు. అయితే కొంతమంది వైద్యులు చేస్తున్న పనులు ఆ వృత్తికే కళంకం తెచ్చి పెడుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులన్నా, వైద్యులన్నా ప్రజల్లో సదాభిప్రాయం అంతంతమాత్రమే. దాన్ని తొలగించే ప్రయత్నం చేయక పోగా కొందరు వైద్యులు ప్రైవేటు క్లినిక్‌లు, ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తూ ఉన్న కొద్దిపాటి నమ్మకాన్ని సైతం పోగొడుతున్నారు.

పేరుకే ప్రభుత్వ వైద్యులు..
విధులు ప్రైవేటు ఆస్పత్రుల్లో..

- వారంలో ఒక్కరోజే విధులకు
- మిగిలిన ఆరు రోజులు సొంత క్లినిక్‌లు, ఆస్పత్రుల్లోనే..
- పర్యవేక్షించాల్సిన అధికారులదీ అదే బాట
- జిల్లా అంతటా ఇదే పరిస్థితి
- ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు
- అరకొర వైద్యసేవలతో పేదల పాట్లు



వికారాబాద్ ఏరియా ఆస్పత్రి

వికారాబాద్: పేరుకే ప్రభుత్వ వైద్యులు.. వీరి సేవలన్నీ ప్రైవేటు హాస్పిటల్స్, క్లినిక్‌లకే అందుతున్నాయి. సర్కారు ఏరియా ఆస్పత్రులపై పర్యవేక్షణ కొరవడడం వల్ల వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారంలో ఒక్కరోజు మాత్రమే డ్యూటీ చేసి మిగతా రోజులు ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌ల బాట పడుతున్నారు. ఓ పక్క ప్రభుత్వం వైద్యరంగాన్ని బలోపేతం చేసి, పేదలకు మెరుగైన వైద్యులు అందించేందుకు అనేక సంస్కరణలు చేపడుతోంది. అయితే కొంత మంది డాక్టర్లు మాత్రం ప్రభుత్వ ఆశయాలకు గండికొడుతున్నారు. ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటూనే ఎక్కువ సమయాన్ని ప్రైవేటు క్లినిక్‌లకు కేటాయిస్తూ లక్షలు ఆర్జిస్తున్నారు. దీంతో పేదలకు ఉచిత వైద్యం అందని ద్రాక్షగానే మారుతోంది.

వారంలో ఒక్కరోజే డ్యూటీ

జిల్లాలోని పీహెచ్‌సీలు, హెల్త్ సబ్ సెంటర్లు, బస్తీ, పల్లె దవాఖానాలు డీఎంఅండ్‌హెచ్‌ఓ పర్యవేక్షిస్తుండగా, తాండూరులోని జిల్లా ఆస్పత్రి, మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని, ఐదు ఏరియా ఆస్పత్రులను డీసీహెచ్‌ఓ పర్యవేక్షణాధికారిగా ఉన్నారు. అయితే పీహెచ్‌సీల సేవలు బాగుండడంతో ప్రసవాలు, ఇమ్యునైజేషన్‌లో జిల్లా.. రాష్ట్ర స్థాయిలో ముందు వరుసలో నిలిచింది. ఇదే సమయంలో వాటికి అనుసంధానంగా ఉన్న ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు మాత్రం అధ్వానంగా మారాయి. ఇక్కడ విధులు నిర్వహించే డాక్టర్లు వారానికి ఒక్కరోజు మాత్రమే డ్యూటీ చేసి చేతులు దులుపుకొంటున్నారు. తాండూరు మాతాశిశు సంరక్షణ ఆస్పత్రిలో ఏడుగురు గైనకాలజిస్టులు ఉన్నారు. వీరు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు విధులు నిర్వహించాలి. ఒకరు మాత్రం నైట్ డ్యూటీ చేయాలి. అయితే ఈ పద్ధతి అమలు కావడం లేదు. ఒక డాక్టర్ 24 గంటల పాటు విధులు నిర్వహించి వారం తరువాత మళ్లీ డ్యూటీకి వస్తున్నారు. దీంతో వైద్య సేవలు సక్రమంగా అందక రోగులు ప్రైవేటు ఆస్పత్రుల బాట పడుతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులను వారు విధులు నిర్వహించే ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు.

కంచే చేను మేసిన చందంగా..

వికారాబాద్, పరిగి, మర్పల్లి, కొడంగల్‌లో ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. తాండూరులో జిల్లా, మాతాశిశు సంరక్షణ ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో ఒక్కో ఆస్పత్రిని విడివిడిగా సూపరింటెండెంట్లు పర్యవేక్షిస్తుండగా ఓరాల్‌గా డీసీహెచ్‌ఓ చూసుకుంటున్నారు. అయితే ఈ ఆస్పత్రుల్లో విధులు నిర్వహించే వైద్యుల్లో 90 శాతం మంది ప్రైవేటు క్లీనిక్‌లు నిర్వహించడమో, ప్రైవేటు ఆస్పత్రుల్లో పని చేయడమో చేస్తున్నారు. వైద్యుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన సూపరింటెండెంట్లు సైతం ప్రైవేటు క్లినిక్‌లు, ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు. ఇటీవల పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన పోస్టుమార్టంపై తీవ్ర దుమారం లేసిన విషయం తెలిసిందే. మృతురాలి వద్ద ఉన్న నగలను ఆస్పత్రి సిబ్బంది కాజేశారని బంధువులు గొడవ పడిన విషయం పెద్ద దుమారాన్నే రేపింది. ఇక పరిగిలో డీసీహెచ్‌ఓ నిర్వహించే ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఓ ప్రజాప్రతినిధి గొడవకు దిగాడు. ప్రభుత్వ వైద్యుడివై ఉండి ఇక్కడ ఆస్పత్రి ఎలా నిర్వహిస్తావని నిలదీశారు. ఈ పంచాయితీ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. అనంతరం పెద్దల జోక్యంతో రాజీ పడ్డారు. ఇలా జిల్లాలో వైద్యుల పనితీరు ఇంత అధ్వానంగా మారినా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

అనంతగిరి: జీవో నంబర్ 142ను రద్దు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్లు, పారా మెడికల్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఏ చంద్రప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ధర్నా ఉంటుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్లు, పారా మెడికల్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ వెంటనే ఈ జీవన రద్దు చేయాలని, లేకుంటే తమ పోరాటం ఆగదని తెలిపారు.

హరీశ్వర్‌రెడ్డి మృతి తీరనిలోటు

- దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- కుటుంబ సభ్యులకు పరామర్శ

పరిగి: ఉమ్మడి రాష్ట్ర ఉప సభాపతి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల హరీశ్వర్‌రెడ్డి మృతి రాష్ట్ర ప్రజలకు తీరని లోటని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఈ నెల 22న హరీశ్వర్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం పరిగికి వచ్చిన మంత్రి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిని పరామర్శించి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ సాధనకు తన ఎమ్మెల్యే పదవిని సైతం త్యాగం చేసిన గొప్ప నాయకుడు హరీశ్వర్‌రెడ్డి అని అన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం హరీశ్వర్‌రెడ్డితో కలసి తాము కూడా పోరాటం చేశామని గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో కొప్పుల అనిల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16 గంటలు.. 70 శంకుస్థాపనలు

- రోజంతా మంత్రి సబితారెడ్డి బిజీ



స్థానికులతో ఆప్యాయంగా కరచాలనం చేస్తున్న మంత్రి సబితారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 16 గంటలు.. 70 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలతోపాటు గణపతి పూజలతో మంత్రి సబితారెడ్డి రోజంతా బిజీగా గడిపారు. ఆదివారం ఉదయం ఆరు గంటలకే ఇంటి నుంచి మహేశ్వరం నియోజకవర్గానికి చేరుకున్న ఆమె.. ఒకేరోజు రూ.18 కోట్ల విలు వ చేసే 70 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి రాజకీయాల్లో సరికొత్త రికార్డు సృష్టించారు. ఇటీవల సీఎం కేసీఆర్ బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు రూ.100 కోట్ల నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా లైన్లు, ఇతర అభివృద్ధి పనులకు ఈ నిధులు ఖర్చు చేస్తున్నారు. పదిహేను రోజుల క్రితం ఒకేరోజు 65 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, రికార్డు నెలకొల్పిన మంత్రి.. తాజాగా తన రికార్డును తానే తిరగరాస్తూ..రాజకీయాల్లో సరికొత్త చరిత్ర సృష్టించారు. ఒకవైపు భగ్గున మండుతున్న ఎండను, సాయంత్రం కురిసిన చిరు జల్లులను లెక్క చేయకుండా రోజంతా ప్రజల మధ్యే గడిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, సాధారణ ప్రజలతో మమేకమయ్యారు. వారి సమస్యలను ఆలకిస్తూ అప్పటికప్పుడు వాటికి పరిష్కారమార్గం చూపించారు.

ముగిసిన యోగాసన పోటీలు

కడ్తాల్: సంస్కారవంతమైన సమాజ నిర్మాణానికి, శక్తివంతమైన దేశ నిర్మాణం కోసం యోగా సాధన దోహద పడుతుందని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రావు అన్నారు. మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రంలో తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా కొనసాగుతున్న పోటీలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు శ్రీధర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో సాధన చేస్తే ఏదైనా సాధించవచ్చని అన్నారు. రానున్న రోజుల్లో యోగాను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. యోగాసన భారత్ నేషనల్ జాయింట్ సెక్రటరీ నందనం కృపాకర్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి యోగాసన పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు త్వరలోనే ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్టీ సాంబశివరావు, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీలు రాంరెడ్డి పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి

- మంత్రి మహేందర్‌రెడ్డి
- రూ. కోటి మంజూరు చేస్తానని హామీ

తాండూరు టౌన్: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాండూరుకు చెందిన పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు హైదరాబాద్‌లో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను వారికి మంత్రికి విన్నవించారు. జనాభా ప్రాతిపదికన ముస్లిం మైనారిటీలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలన్నారు. తాండూరులోని హైదరాబాద్ మార్గంలో శ్మశానవాటిక, ఈద్గాలకు ఐదు ఎకరాల చొప్పున భూమి కేటాయించాలని కోరారు. పాత ఈద్గా మైదానానికి అదనంగా 25 గుంటల స్థలాన్ని ఇవ్వాలన్నారు. రాజీవ్‌కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లోని మసీదులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. మైనార్టీ బాలికల పాఠశాల వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని విన్నవించారు. పట్టణంలోని ఇందిర చౌక్ నుంచి రైల్వే స్టేషన్ వరకు ఆగిన రోడ్డు విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని వారు కోరారు. ఈ సందర్భంగా మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమం కోసం తన వంతుగా రూ. కోటి కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే, ఎంపీ నిధులు కూడా వచ్చేలా చూస్తానని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను కూడా ముస్లిం మైనార్టీల సంక్షేమానికి రూ. 50 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మైనార్టీ నాయకులు అబ్దుల్ హాది, ఖుర్షీద్ హుస్సేన్, నయీమ్, అబ్దుల్ రజాక్, అబ్దుల్ హమీద్, షౌకత్ పటేల్, నాయక్ అలీ, సత్తార్, ఫయాజ్ అలీ, నసీమొద్దీన్, మహ్మద్ గౌస్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి, ఎంపీలకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

ఆర్టీసీ దసరా ఆఫర్

పరిగి: దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రయాణికులకు ఆ శాఖ బంపర్ ఆఫర్లను ప్రకటించిందని పరిగి డిపో మేనేజర్ కరుణశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో సీట్లు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు ఆఫర్ ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ముందస్తుగా సీట్లు రిజర్వ్ చేసుకున్న వారికి తిరుగు ప్రయాణం టికెట్టుపై 10శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు అక్టోబర్ 15 నుంచి 29వ తేదీలోపు ప్రయాణం చేయవలసి ఉంటుందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కళాశాలల్లో తగ్గిన అడ్మిషన్లు



- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పడిపోయిన విద్యార్థుల సంఖ్య
- 10వ తరగతి ఉత్తీర్ణత శాతం తగ్గడమే కారణం
- పాసైన వారు ప్రైవేటు వైపు మొగ్గు

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో అడ్మిషన్లు జరగలేదు. అందుకు కారణం గత విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వికారాబాద్ జిల్లా చివరి స్థానంలో నిలవడమే కారణం. జిల్లాలో 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ప్రతి ఏటా మొదటి సంవత్సరంలో 2,500 నుంచి 3వేల మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందేవారు. కానీ ఈ ఏడాది కేవలం 1,914 మందే చేరారు. తాండూరు, మర్పల్లి జూనియర్ కళాశాలల్లో జనరల్ కోర్సులతో పాటు ఒకేషనల్ కోర్సులు ఉన్నాయి. తాండూరు, వికారాబాద్ జూనియర్ కళాశాల్లోని పలు కోర్సుల్లో ఉర్దూ మీడియం కూడా అందుబాటులో ఉంది. ఉచిత పాఠ్యపుస్తకాలు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నా చాలా మంది విద్యార్థులు ప్రైవేటు కళాశాలలకు వెళ్లారు. సప్లిమెంటరీ తరువాతైనా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందేమోనని అధికారులు భావించారు.

కళాశాల వారీగా అడ్మిషన్లు

నవాబుపేట్ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది మొదటి సంవత్సరంలో 36 మంది విద్యార్థులు చేరారు, వికారాబాద్ జూనియర్ కళాశాలలో 269 మంది, తాండూరులో 792 మంది, పెద్దేముల్‌లో 64 మంది, పరిగి జూనియర్ కళాశాలలో 197 మంది, మర్పల్లిలో 116 మంది, మోమిన్‌పేట్‌లో 85 మంది, దోమలో 122 మంది, కొడంగల్ జూనియర్ కళాశాలలో 233 మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు పొందారు.

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌నే గెలిపించాలి

- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి
- మల్లెమోనిగూడలో పార్టీ జెండా ఆవిష్కరణ



కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ కార్డు గురించి ప్రజలకు వివరిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: రానున్న ఎన్నికల్లో తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి కోరారు. ఆదివారం పరిగి పట్టణంలోని మల్లెమోనిగూడలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేంద్ర నాయకత్వం ఇచ్చిన 6 పథకాల గ్యారంటీ కార్డుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే గ్యారంటీ కార్డు రూపొందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతినెలా మహిళలకు రూ. 2,500, ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం, రూ. 500లకు వంట గ్యాస్ సిలిండర్, ప్రతి ఏటా పంట సాగుకు రూ. 15వేలు, రైతు కూలీలకు రూ. 12 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వరి పంటకు అదనంగా రూ. 500లు ఇస్తామని పేర్కొన్నారు. 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, జాగా లేని వారికి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు, రూ. 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ కింద వైద్యం పొందే అవకాశం కల్పిస్తామని చెప్పారు. పింఛను మొత్తాన్ని రూ. 4వేలకు పెంచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంతు, నాయకులు ఆంజనేయులు, చిన్ననర్సింలు, యేజజ్, శ్రీనివాస్ నాయక్, మల్లేష్, శౌర్యనాయక్, అక్బర్, రామకృష్ణారెడ్డి, మీర్జా, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే రంగం అభివృద్ధి ఘనత బీజేపీదే

- పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి
- రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులకు ఘన స్వాగతం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి

షాద్‌నగర్‌రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో రైల్వే రంగం మరింత అభివృద్ధిని సాధించిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి అన్నారు. వందేభారత్ రైలును ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించిన సందర్భంగా ఆదివారం షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఆ పార్టీ నాయకులు, రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బొక్కా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని అన్ని ప్రాంతాలకు రైల్వే ప్రయాణికులను అతి వేగంగా గమ్యస్థానాలకు చేరవేసే విధంగా సూపర్ ఫాస్ట్ రైళ్లను ఏర్పాటు చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రైల్వే ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందించాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వందేభారత్ రైళ్లను ప్రారంభించారని అన్నారు. ప్రయాణికులు రైల్వే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్, జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చెంది మహేందర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, రైల్వే బోర్డు సభ్యులు దిడ్డిగోపాల్, చంద్రశేఖర్, రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర గొప్పది



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని, భావి భారత పౌరులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత వారిపైనే ఉందని మూసీ రివర్ బోర్డు చైర్మన్, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. జిల్లా గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్‌లోని వంగా శంకరమ్మ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానోత్సవానికి ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏవీఎన్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశ అభివృద్ధిలో విద్యా వ్యవస్థ పాత్ర ఎంతో గొప్పదని, బడ్జెట్ పాఠశాలల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం బడ్జెట్ పాఠశాలలకు ఆస్తి పన్ను, విద్యుత్ బిల్లుల్లో రాయితీ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు పాపిరెడ్డి, కార్యదర్శి ఎస్.ఎన్.రెడ్డి, జిల్లా కార్యదర్శి భరత్ కుమార్, కోశాధికారి మీనేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వశాంతి కోసం ఆయుత చండీయాగం

షాద్‌నగర్: విశ్వశాంతి కోసం నిర్వహించే ఆయుత చండీ యాగంలో అందరు పాల్గొనాలని కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామి కోరారు. షాద్‌నగర్ పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో అక్టోబర్ 26 నుండి నవంబర్ 8వ తేదీ వరకు నిర్వహించే ఆయుత చండీ అతిరుద్ర యాగానికి సంబంధించి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ.. ప్రజలు సుభిక్షంగా, ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలనే సంకల్పంతో ఈ యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశ్వశాంతి కోసం అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, డాక్టర్ మర్రి కృష్ణారెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, పలబట్ల మోహన్‌రావు, శ్రీశైలంగౌడ్, మురళి, రుషికేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఉచిత చేప పిల్లల పంపిణీ

బొంరాస్‌పేట: బొంరాస్‌పేట శివారులోని చెరువులో సోమవారం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా చేపపిల్లల పంపిణీ కార్యక్రమం ఉంటుందని రైతు సంఘం మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 8గంటలకు చెరువు వద్ద నిర్వహించే కార్యక్రమంలో మండలంలోని మత్స్యకారులు పెద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కొడంగల్: ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సోమవారం నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో పర్యటిస్తారని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు బొంరాస్‌పేట మండలంలోని పెద్ద చెరువు దగ్గర మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తారు. 9 గంటలకు కొడంగల్ పెద్ద చెరువు దగ్గర చేపపిల్లలను పంపిణీ చేస్తారు. దౌల్తాబాద్ మండలంలోని నందారం గ్రామంలో మనఊరు మనబడి కార్యక్రమంలో పాల్గొంటారు. రూ.30 లక్షలతో నిర్మించిన స్కూల్ భవనాన్ని ప్రారంభిస్తారు. రూ.కోటి 50 లక్షలతో కొడేడ్ నందారం బీటీ రోడ్డుకు భూమిపూజ చేస్తారు. మాటూరు గ్రామంలో మహిళా సమాఖ్య భవనం, గోకాఫస్లావాద్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభిస్తారు. పలు తండాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేస్తారని పీఏ శ్రీనివాస్ తెలిపారు. కార్యకర్తలు, అధికారులు సకాలంలో హాజరుకాగలరని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

మర్పల్లి: సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మండల పరిధిలోని కల్‌ఖోడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనోద్దీన్, పుండరీకం, జగన్నాథం, యేసురత్నం బీజేపీకి చెందిన శివకుమార్, విష్ణువర్ధన్‌తో పాటు వారి అనుచరులు ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో ఆదివారం ఎమ్మెల్యే కాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మధుకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సత్తాచాటిన ప్రభుత్వ విద్యార్థులు

- డిగ్రీ 4, 6వ సెమిస్టర్లలో ఉత్తమ మార్కులు
- పీజీ సెట్‌లోనూ ర్యాంక్‌లు కైవసం
- ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం: ప్రిన్సిపాల్

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటీవల విడుదలైన డిగ్రీ 4వ, 6వ సెమిస్టర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించారని కళాశాల ప్రిన్స్‌పాల్ జె.రాజారాం, వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానం, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ రాంబాబు, అకడమిక్ కోఆర్డినేటర్ రమేష్ తెలిపారు. పాలమూరు యూనివర్సిటీ పరిధిలో వచ్చే ఈ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడంపట్ల ఆయా విద్యార్థులను అభినందించారు.ఇటీవల విడుదలైన పరీక్షా ఫలితాల్లో 6వ సెమిస్టర్ ఎంపీసీలో బి.సునీత 9.24 జీపీఏ, కె.గాయత్రి 8.80జీపీఏ, బి.లక్ష్మీప్రసన్న 7.84జీపీఏ, బీజెడ్‌సీలో పి.శృతి 9జీపీఏ, ఈ.శిరీష 8.44జీపీఏ, బీ.కామ్‌లో పి.మౌనిక 8.08జీపీఏ, టి.అనూష 7.76జీపీ, బీఏలో ఎం.అరవింద్ 7.85జీపీఏ, కె.రజిత 7.59జీపీఏ, కె.ప్రభాకర్ 7.59జీపీఏ మార్కులు సాధించారు. 4వ సెమిస్టర్ బీజెడ్‌సీలో కె.అరుణ 7.36జీపీఏ, కె.రాధిక 7.96జీపీఏ, సిహెచ్.స్వాతి 7.96జీపీఏ, ఎంపీసీ/ఎంపీసీఎస్‌లో సి.జ్యోత్స్న 8.92జీపీఏ, కె.చంద్రకళ 8.12జీపీఏ, బీ.కామ్‌లో టి.భవానీ 8.20జీపీఏ, ఎం.శిరీష 7.80జీపీఏ, బీఏలో బి.మమత 8.44జీపీఏ, డి.అనూరాధ 8.16జీపీఏ, శివలీల 8.08జీపీఏ సాధించారు. అధ్యాపకుల సమష్టి కృషితోనే ఉత్తమ మార్కులు సాధించామని విద్యార్థులు పేర్కొంటున్నారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో అధ్యాపక బృందం

పీజీ సెట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు..

కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటీవల విడుదలైన పీజీ ప్రవేశ పరీక్ష సెట్‌లో ప్రతిభ చాటారు. శృతి ఎంఏ ఇంగ్లీష్‌లో 293వ ర్యాంకు, సాయికృష్ణారెడ్డి గణితంలో 393వ ర్యాంకు, శృతి బాటనీలో 256వ ర్యాంకు, నవిత ఇంగ్లీష్‌లో 483వ ర్యాంకు, బాటనీలో 464వ ర్యాంకుతోపాటు కళాశాలకు చెందిన విద్యార్థులు రజిత, శిరీష, సునీత, సాయికిరణ్, శిరీష, మహేశ్వరి, ప్రభాకర్, శైలజ, రాజు, జ్యోతిక, అంకిత వివిధ సబ్జెక్టుల్లో ర్యాంకులు సాధించి పోస్టు గ్రాడ్యూయేషన్‌కు అర్హత సాధించారని అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక తరగతులతోనే..



కళాశాలలో వెనకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ప్రిన్సిపాల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కళాశాలలో స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహించనున్నాం. ప్రత్యేక తరగతులతో ఉత్తమ మార్కులు సాధిస్తున్నారు.

– రాంబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొడంగల్

అధ్యాపకుల సమష్టి కృషి



కళాశాలలో అధ్యాపకుల సమష్టి కృషితో పాలమూరు యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన 4వ, 6వ సెమిస్టర్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ మార్కుల సాధించారు. పీజీ సెట్‌లో సైతం మంచి ర్యాంకులు సాధించారు.

– రాజారాం, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొడంగల్

విద్యార్థుల ఫీజులు మాయం

- రూ.39 లక్షలు కాజేసిన హిట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ జీవన్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన యాజమాన్యం

పూడూరు: విద్యార్థుల తల్లిదండ్రులు కష్టపడి చెల్లించిన ఫీజులు కాజేసిన హిట్స్ బీఈడీ, డీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్ జీవన్, లైబ్రేరియన్ వెంకటేశ్‌పై చర్యలు తీసుకుంటామని హోలీమేరి (హిట్స్) విద్యాసంస్థల చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. పూడూరు మండలం ఎన్కేపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న హిట్స్ డీఈడీ, బీఈడీ విద్యాసంస్థల చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కళాశాల ప్రిన్సిపాల్ జీవన్, లైబ్రేరియన్ వెంకటేశ్.. రెండేళ్లలో దాదాపు రూ.39 లక్షల ఫీజులు విద్యార్థుల నుండి నేరుగా, ఫోన్‌పే, గుగుల్‌పే ద్వారా తమ ఖాతాలో జమచేయించుకుని కాలేజీ రసీదులు ఇవ్వకుండా పేపర్ స్లిప్‌లను ఇచ్చారని తెలిపారు. విద్యార్థుల ఫీజులే కాకుండా ప్రభుత్వం నుంచి వచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు సైతం కాజేసి కాలేజీ రికార్డులు, బ్యాంకు స్టేట్‌మెంట్‌లను టాంపరింగ్ చేశారని తెలిపారు. ఇదేమని ప్రశ్నిస్తే యాజమాన్యంపై దాడులకు దిగారని తెలిపారు. రెండేళ్ల బీఈడీ, డీఈడీ కోర్సు పూర్తికావడంతో సర్టిఫికెట్ల కోసం వచ్చిన విద్యార్థులకు ఫీజులు చెల్లించాలని యాజమాన్యం డిమాండ్ చేయడంతో అప్పుడే చెల్లించామని విద్యార్థులు యాజమాన్యం దృష్టికి తెచ్చారు. ఫోన్‌పే, గుగుల్‌పే ద్వారా నగదు చెల్లించామని ప్రిన్సిపాల్ ఇచ్చిన రసీదులు కాలేజీ యాజమాన్యానికి చూయించారు. దీంతో యాజమాన్యం, విద్యార్థుల మధ్య గొడవ జరగడంతో అసలు విషయం బయటపడింది. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు కాలేజీ ఎదుట ఆందోళన చేపట్టడంతో దిగొచ్చిన యాజమాన్యం విద్యార్థుల ఫీజులు కాజేసిన ప్రిన్సిపాల్ జీవన్, లైబ్రేరియన్ వెంకటేశ్‌పై చన్గోముల్ పోలీసుకు ఫిర్యాదు చేశారు. ఫీజులు చెల్లించిన విద్యార్థులు ఆందోళన చెందవద్దని.. సోమవారంలోగా అందరికీ సర్టిఫికెట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. తమను మోసం చేసిన కాలేజీ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

ధారూరులో 'మిలాద్' ర్యాలీ

ధారూరు: ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ధారూరులోని జామా మసీదు నుంచి మసీదు వరకు జల్సా మిలాద్–ఉన్–నబీ ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి వాహనాలలో హైదరాబాద్‌లోని దారుసలాంకు తరలివెళ్లారు. ఈ ర్యాలీలో ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షుడు మొహమ్మద్ మోహిజ్ ఖురేసీ, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ అజీమ్ ఖురేషి, ముస్లింలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మైనార్టీ నాయకులు

మద్యం మత్తులో చెరువులోకి దిగి..

ఒకరి మృతి

పెద్దేముల్: మద్యం మత్తులో చెరువులో ఈత కొట్టేందుకు దిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన ఎర్ర శ్రీనివాస్(32) కూలీపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 23న శ్రీనివాస్ అదే గ్రామానికి చెందిన బ్యాగరి సురేష్, రాములు, బైండ్ల శ్రీనుతో కలిసి కూలీ పనులకు తాండూరుకు వచ్చాడు. కూలీ పనులు ముగించుకొని సాయంత్రం సమయంలో నలుగురు కలిసి మద్యం సేవించారు. తిరిగి గ్రామానికి వెళ్లేందుకు మంబాపూర్ మీదుగా బయలు దేరారు. అయితే మంబాపూర్ గ్రామ శివారులో చెరువు కనిపించడంతో చెరువులో ఈత కొట్టేందుకు ఆగారు. శ్రీనివాస్ ఈత కొట్టేందుకు చెరువులోకి దిగాడు. మద్యం మత్తులో ఉండటంతో ఊపిరి సరిగా ఆడక నీటిలో మునిగిపోయాడు. ఈ విషయం గమనించిన తోటి కూలీలు సడీచప్పుడు కాకుండా ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. రాత్రి అయినా భర్త ఇంటికి రాలేదని ఆందోళనకు గురైన శశికళ.. భర్త గురించి తోటికూలీలను అడిగింది. మంబాపూర్ చెరువులోకి దిగి మునిగిపోయాడని వారు చెప్పడంతో శశికళ.. పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు చెరువు వద్దకు చేరుకొని రాత్రి మొత్తం వెతికినా శ్రీనివాస్ జాడ కనిపించలేదు. మరుసటి రోజు(ఆదివారం) ఉదయం శ్రీనివాస్ మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు వస్తున్న ఆర్థిక మంత్రి హరీశ్‌రావు పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీ తాండూరు నియోజకవర్గ నాయకలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరు నియోజకవర్గంలో సుమారు రూ.50కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు గాను ఈనెల 27న మంత్రి హరీష్‌రావు తాండూరుకు రానున్నారన్నారు. తాండూరు మండలం చంద్రవంచ, జినుగుర్తి, పెద్దేముల్ మండలం కందనెల్లి, యాలాల మండలం జుంటిపల్లి గ్రామాల్లో సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు రూ.10.23 కోట్ల నిధులతో పనులు ప్రారంభించనున్నారన్నారు.



బీఆర్‌ఎస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరులో రూ.10 కోట్ల నిధులతో వ్యవసాయ మార్కెట్ కమిటి నూతన భవన నిర్మాణ పనులు, రూ.25కోట్లతో నర్సింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన, తాండూరు పట్టణంలో రూ.1.35 కోట్ల నిధులతో గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపనలు చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. అంతే కాకుండా పట్టణ పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభోత్సవం చేస్తారన్నారు. మంత్రి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. అంతే కాకుండా తాండూరు పట్టణంలోని విలియమ్‌మూన్ మైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నాయకులు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్త, నాయకులు పురుషోత్తంరావు, శ్రీనివాసచారి, ఇర్ఫాన్, ఉమాశంకర్ తదితరులున్నారు.

నిమజ్జనంలో నిబంధనల ఉల్లంఘన

ఆరు కేసులు నమోదు

తాండూరు టౌన్: వినాయక నిమజ్జనంలో నిబంధనలు అతిక్రమించినవారిపై ఆరు కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా డీజే సౌండ్ సిస్టమ్ వినియోగించిన శ్రీచంద్ర, ప్రశాంత్, భానుతేజ, గణేష్‌తో పాటు డీజే యజమానులపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే నిమజ్జన ఊరేగింపు సందర్భంగా భద్రప్ప గుడి వద్ద ఇచ్చిన సమయం కంటే, అధిక సమయం వేచి ఉండటంతో పాటు, కౌన్సిలర్ తాలూకా అంటూ పోలీసు అధికారులతో వాగ్వాదానికి దిగిన శ్రీధర్, రాము, శ్రీకాంత్, పూజారి, పాండుతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశామన్నారు. అదే రాత్రి మాణిక్ నగర్‌కు చెందిన రెండువర్గాలు ఊరేగింపు సందర్భంగా ఒకరినొకరు తోసుకుంటూ, ఇతర వాహనాలకు అంతరాయం కలిగించినందుకు గాను హరీష్ గౌడ్, వంశీ, సాయి, వెంకట్, సోమ్లా, శ్రీకాంత్, శ్రీనివాస్, రమేష్, నరేందర్, నర్సింహులుపై కేసు పెట్టామని సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



కృష్ణయ్య మృతదేహం

ఆమనగల్లు: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మంగళపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు ఎడ్ల కృష్ణయ్య(56)కు మంచాల గుట్ట వద్ద మూడున్నర ఎకరాల పొలం ఉంది. రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. బోర్ మోటార్ ఆన్ చేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమీప పొలాల రైతులు గమనించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బలరాం తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం

యాచారం: బైక్ అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మాడ్గుల మండలం నార్సయిపల్లికి చెందిన తోలు కృష్ణయ్య(28) ఆదివారం యాచారం ప్రభుత్వాస్పత్రికి వస్తున్నాడు. మాల్–తమ్మలోనిగూడ గేట్ మార్గంలో బైక్ అదుపుతప్పడంతో రోడ్డు పక్కనున్న ఈజీఎస్ దిమ్మెను అతివేగంగా ఢీకొట్టాడు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలిపారు.

విగ్రహావిష్కరణకు రండి

మొయినాబాద్‌రూరల్: ఈ నెల 26వ తేదీన (మంగళవారం) వీరవనిత ఐలమ్మ జయంతి సందర్భంగా అజీజ్‌నగర్‌లో ఐలమ్మ నూతన విగ్రహ ఆవిష్కరణ చేయనున్నట్లు గ్రామ శ్రీ వెంకటేశ్వర రజక కో–ఆప్షన్ సంఘం అధ్యక్షుడు యాదగిరి పేర్కొన్నారు. ఆదివారం సంఘం సభ్యులతో కలిసి నగరంలో మంత్రులు సబితారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డితో పాటు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మండల ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. విగ్రహ ఆవిష్కరణకు మంత్రులతో పాటు ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని మంగళవారం ఉ.10 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. రజక సంఘం సభ్యులతో పాటు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మంత్రులను కలిసిన వారిలో అజీజ్‌నగర్ వార్డు సభ్యులు మౌనిక, మల్లేష్, పెంటయ్య, మల్లేష్, బాబు తదితరులున్నారు.

ఓటుబ్యాంకుగా వాడుకుంటున్నారు

బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్

బంట్వారం: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటూ రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సేకరించిన గణాంకాల ప్రకారం చట్ట సభల్లో బీసీల ప్రాతినిధ్యం 14శాతం దాటలేదని ఆయన వివరించారు. జనాభాలో 56 శాతం బీసీలు ఉంటే చట్టసభల్లో మాత్రం 14 శాతమే ప్రాతినిధ్యం వహించడం విచాకరమని ఆయన పేర్కొన్నారు. 16 రాష్ట్రాల్లో నైతే పార్లమెంట్‌లో ఒక్క సభ్యుడు కూడా బీసీలు లేరని ఆయన అన్నారు. తెలంగాణాలో 119 శాసన సభ్యుల్లో బీసీలు కేవలం 21 మంది మాత్రమే ఉన్నారని స్పష్టం చేశారు. 244 ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్లలో ఒక్కరు కూడా బీసీ లేరని ఆయన తెలిపారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో 26 మంది జడ్జిల్లో ఒక్క బీసీ లేకపోవడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించేలా రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని కేంద్రాన్ని కోరారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. రూ.లక్ష కోట్లతో బీసీ సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధమైన హక్కులు కల్పించాలన్నారు. బీసీల న్యాయమైన డిమాండ్ల పై వేలాదిమందితో పార్లమెంటును ముట్టడిస్తామని లక్ష్మణ్‌యాదవ్ హెచ్చరించారు.

పేదలకు ఆర్థికసాయం

దోమ: గ్రామాల్లో నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ అన్నారు. దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో బోయిని మాణేమ్మ అనే మహిళ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఈ మేరకు స్థానిక నేతలతో బాధిత కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం ఒక్కొక్కరు రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. నిరుపేదలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి మాజీ ఎంపీటీసీ నర్సింహులు, కాంగ్రెస్, టీడీపీ నేతలు రాజేశ్ యాదవ్, ముద్దం బాల్‌రాజ్ యాదవ్, రాములు, రమేశ్, మహేశ్, కృష్ణస్వామి, నర్సింహులు, శ్రీనివాస్, యాదయ్య, జంగయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న నేతలు

గుండెపోటుతో యువకుడి మృతి

బషీరాబాద్: ఓ యువకుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన బషీరాబాద్ మండలం మంతట్టి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి భీమప్ప కొడుకు తలారి శ్రీశైలం(26) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం బొంరాస్‌పేట మండలం వడిచర్ల గ్రామంలో తన స్నేహితుడి బంధువుల అంత్యక్రియలకు కారు నడపడానికి వెళ్లాడు. అక్కడ వెళ్లాక అస్వస్థతకు గురయ్యాడు. సాయంత్రం అదే కారులో స్టీరింగ్ సీటులోనే ప్రాణాలు వదిలాడు. కిరాయి తీసుకెళ్లిన గ్రామస్తులు వచ్చి చూసేసరికి స్పృహలో లేకపోవడంతో స్థానిక వైద్యుడికి చూపించారు. పరీక్షించిన వైద్యుడు గుండెపోటుతో చనిపోయినట్లు నిర్ధారించాడు. ఆదివారం అంత్యక్రియలు జరిగాయి. భాగ్యశ్రీని రెండేళ్ల కిందట శ్రీశైలం ప్రేమవివాహం చేసుకున్నాడు.



శ్రీశైలం (ఫైల్)

ఎగుమతి చేసే స్థాయికి ఎదిగాం

చేప పిల్లల పంపిణీలో ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్/శంకర్‌పల్లి: రాష్ట్రంలో మత్స్యసంపద పెరిగిందని.. చేపలు ఎగుమతి చేసే స్థాయికి రాష్ట్రం ఎదిగిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరు పెద్ద చెరువులో, శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపురం, మండల పరిధిలోని ప్రొద్దుటూరు పెద్ద చెరువులో ఆదివారం చేపపిల్లలు వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు చెరువులు ఎడారిని తలపించేవని.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ చెరువులకు జలకళ తీసుకొచ్చారన్నారు. చెరువుల్లో ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలు వదిలి మత్స్యకారులకు ఉపాధి పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్, సర్పంచ్ స్వరూప, వార్డు సభ్యుడు వెంకటేశ్, మాజీ ఉపసర్పంచ్ ఆంద్రూ, ఏఎంసీ డైరెక్టర్లు మహేశ్‌యాదవ్, భిక్షపతి, నాయకులు జయవంత్, నర్సింహగౌడ్, పరమేశ్, ముజ్జు, చెన్నయ్యయాదవ్, రాంరెడ్డి, జకరయ్య , శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు గోవిందమ్మ, ప్రొద్దుటూరు సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బొల్లారం ప్రవళిక, ఏఎంసీ చైర్మన్ పాపారావు, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్, మున్సిపల్ అధ్యక్షుడు వాసుదేవ్‌కన్నా, కౌన్సిలర్లు జూలకంటి లక్ష్మమ్మ, గోపాల్ పాల్గొన్నారు.



చిలుకూరు పెద్ద చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

అభివృద్ధిని చూసే చేరికలు



యాచారం: ఎమ్మెల్యే మంచిరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న చింతపట్ల గ్రామస్తులు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు అధికారంలోకి వచ్చేది లేదు.. ఆ పార్టీలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చింతపట్ల గ్రామానికి చెందిన సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 50 మంది ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజానీకం మూడోసారి బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారని.. కాంగ్రెస్, బీజేపీలను ఎట్టి పరిస్థితుల్లో నమ్మరన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని చూసే ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతునవారన్నారు. వెనుకబడిన గ్రామాలను గుర్తించి అధిక నిధులు కేటాయిస్తామన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఆయన కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బండి యాదయ్య, అశోక్, సత్యనారాయణ, సలీం, బషీర్, రవీందర్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లిక్కి నర్సింహారెడ్డి, నాయకులు లిక్కి గోవర్ధన్‌రెడ్డి, సింగారం వెంకటయ్య, చంద్రయ్య, మధూకర్‌రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలోని తుర్కయంజాల్ 10వ వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన శోభానగర్‌లో ప్రతిష్ఠించిన గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తాగునీటి, యూజీడీ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు విన్నవించారు. ఆయన వెంట డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, మాజీ సర్పంచ్‌లు లక్ష్మారెడ్డి, దశరథ, కౌన్సిలర్ రవీందర్ రెడ్డి, నాయకులు విజయానంద రెడ్డి, శేఖర్‌గౌడ్, గౌతమ్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి, కాలనీ వాసులు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

ఆమనగల్లు: రాష్ట్ర ప్రజల అండతో బీఆర్‌ఎస్ మూడవసారి అధికారంలోకి రావడం ఖాయమని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చూసి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఆయన చెప్పారు. ఆదివారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో మాలెపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందుతున్నాయని ప్రజా మద్దతుతో మరోమారు అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రతిపక్ష పార్టీలు పగటి కలలు కంటున్నాయని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, నాయకులు సయ్యద్ ఖలీల్, కోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.